# కథకుడు కామేశం

కెవ్వున కేకవేసి పడిపోయింది వరలక్ష్మి నిద్రపోతున్న సందరమ్మ భూమికి జానెడుత్తున ఎగిరి పడింది. లేచి మహాకాయాన్ని సర్దుకుని గబగబా కేక వినిపించిన వేపు పరుగెత్తింది. వరలక్ష్మి మొగుడు రామారావు ఒక్క పరుగులో వచ్చాడు, గదిలో టిఫిన్ చేస్తోన్న భానుమతి హడావుడిగా అట్లకర్రతో వచ్చేసింది.

“ఏమయింది?” అందరి ప్రశ్న.

వరలక్ష్మి వారికెవరికి సమాధానం చెప్పలేకపోయింది. అందరికంటే గాబరా పడిపోతూ ప్రక్కనే ఉన్న బిందెలోంచి దోసిలితో నీళ్ళు తెచ్చి వరలక్ష్మి ముఖం మీద చల్లాడు రామారావు. కూతురి మొఖాన్ని పైటచెంగుతో తుడిచి ఆందోళనతో, “ఏమయింది వరం? అస లేమయింది?” అని అడిగింది.

వరలక్ష్మీ భయం భయంగా గదిలోకి చూస్తూ, ‘దొంగ..... దొంగ.....’ అని చెప్పలేక, చెప్పలేక చెప్తూ సుందరమ్మని రెండు చేతులతో గట్టిగా పట్టుకుంది.


‘ఎక్కడ? ఎక్కడ......?’ పెరట్లోకెళ్ళి కర్రపట్టుకొనస్తూ రామారావు అన్నాడు. భానుమతి కత్తిపీట పట్టుకొచ్చింది. సుందరమ్మ లేచి నిలబడి గోడకి చేరవేసి ఉంచిన పీట పట్టుకుంది.

‘ఇదిగో..... వీడే....’ గుమ్మం వరకూ వెళ్లి భయంతో కళ్ళు మూసుకుని వెనక్కి తిరిగి పోయింది వరలక్ష్మీ. వరలక్ష్మి వెనుక ఉన్న భానుమతి గాబరాపడి పోతూ, కొట్టటానికి కర్రనెత్తబోతున్న రామారావు చేతిని పట్టుకొని, ‘ఆగండి ఆగండి.... ఆయన... దొంగకాదు..” అని వాళ్ళకి చెప్తూ, “అయ్యో, మీరింత సేపూ ఇంట్లోనే ఉన్నారటండీ. ఆఫీసుకు సెలవు పెట్టారు? ఇవాళ అని భర్త కామేశంతో అని

‘మా హైద్రాబాద్ పిన్నండి... మా చెల్లెలు వరలక్ష్మి..... వాళ్ళాయన ఇప్పుడే వచ్చారింకా ఇంతలో ‘వరలక్ష్మీ బట్టలు మార్చుకొస్తానని ఈ హడావుడి చేసేసింది’ అని కామేశానికి వాళ్ళని పరిచయం చేసింది భానుమతి వస్తోన్న నవ్వు నాపుకుంటూ.

ఎడంచేత్తో జుట్టు పీక్కుని ఎడం చేతి వ్రేళ్ళని కళాత్మకంగా కొరుక్కుంటున్న కామేశం ఈ పరిస్థితిని చూసి బిక్క చచ్చిపోయినట్టయి పోయాడు. ఇంకా అప్పుడే

పెన్నులో ఇంకు పోనుకుంటున్న కామేశం ‘వరలక్ష్మి’ వేసిన కేకకి తుళ్ళి పడి సిరాబుడ్డీని ‘ఠఫీమని’ ఒదిలేయటంతో అతని లుంగీ అంతా సిరామయం అయిపోయింది.



‘నీ ఇల్లు బంగారంగానూ, హడలు గొట్టి చంపావే. ఆయన మీ బావగారే దొంగకాదు.... పాపం... అతను కథలు రాసుకునే మూడ్‌లో ఉన్నారు.’ అని నవ్వేసింది.

భానుమతి కాపురం కొచ్చే కొత్తలో ఆమెకూ కామేశం పరిస్థితి అయోమయం గానే ఉండేది ఒక రోజు తదేకధ్యానంతో గోళ్ళుకొరుక్కుంటూ కూర్చీలో కూర్చున్న కామేశాన్ని వెనకనుంచి వచ్చి రెండు చేతుల్తో బంధించేసింది ప్రేమతో గట్టిగా పట్టుకుంది కామేశాన్ని. కామేశం ముందు అలానే గోళ్ళు కొరుక్కుంటూ, మరి కాసేపటికి పొట్టల కూడా కొరకేసుకుని, అమూడ్‌లో తన చేతివేలే అనుకుంటూ భార్య గోళ్ళుకూడా కొరికేస్తుంటే ‘ఇదో శృంగారం చేష్ట’ అనుకుని మురిసిపోయి వేను మరిచి పోయింది భానుమతి. కామేశానికి మాంచి మూడొచ్చేసరికి భార్య చేతి గోళ్ళూ

పూర్తిగా అయిపోవడం చేత వేలుకూడా కొరికేసరికి భానుమతి కెవ్వుమంది. భానుమతి వేలి నుండి రక్తంకూడా కారింది. ఇంతలో కామేశం తల్లి ఏమయిందనుకుంటూ పరుగెత్తుకుని వచ్చిందక్కడికి. భానుమతి సిగ్గుతో జరిగిన విషయం చెప్పలేదు. తలొంచుకొని అప్పటికి ఈలోకంలో పడ్డ కామేశం 'ఏమయింది' అనుకుంటూ చూసాడు భార్య ముఖంలోకి కామేశం తల్లి "అమ్మాయీ ఇంత వరకూ నీకా విషయం చెప్పనేలేదు. అబ్బాయి కథలు వ్రాసే ముందుకాని వ్రాస్తున్నప్పుడుగాని వాడి దగ్గర కెళ్ళబోకు... వాడు తన్మయత్వంతో ఏం చేస్తున్నదీ మర్చిపోతాడు." అని చెప్పి వెళ్ళిపోయింది. అప్పటి నించి భర్త మూడ్స్‌ని బాగా అర్థం చేసేసుకుంది భానుమతి.

కామేశం ఒక్కోసారి మూడ్ కోసం జుట్టు పీక్కుంటాడు. మరోసారి గోళ్ళు కొరుక్కుంటాడు. చేతి గోళ్ళు పూర్తిగా అయిపోతే కాళ్ళ గోళ్ళని కొరుక్కుంటాడు. ఇలా మూడ్ కోసం నానా అవస్థలూ పడే కామేశం గురించి బాగా తెలిసి ఉన్న భానుమతి కామేశం ముఖం మీదున్న సిరామరకని తువ్వాల్తో తుడిచేసింది.

"బాగున్నావా నాయనా!... ఎప్పుడో నీ పెళ్ళిలో చూసాను కామోసు. అప్పట్నించి ఎప్పుడు ప్రయాణం పెట్టుకున్నా ఏదో అడ్డంకు వస్తునే ఉంది" అని నాలుగు రోజులు కనిపించని యజమానివి అయిదోరోజు అదేపనిగా నాకటం మొదలు పెట్టిన పెంపుడు కుక్కలా కామేశాన్ని క్రింది నుంచి మీదకి, మీద నుంచి క్రిందికి అప్యాయంగా చూసింది సుందరమ్మ. తన మూడ్‌ని పాడుచేసి, తన సెలవుని వృధా చేసినందుకు కామేశానికి వాళ్ళ మీద చాలా కోపం వచ్చేసింది. పల్లేరు ముళ్ళ మీద నుంచి నడుస్తున్నట్లు నడిచాడు. అక్కడికక్కడే.

"ఆ మధ్య హైద్రాబాద్‌లో దొంగనతాలు విపరీతంగా ఉన్నాయి కదా బాబూ ఆ 'భయం' మీ మరదలు కింకా ఉండిపోయింది." సుందరమ్మ అంది. అనేసరికి మూడ్ గురించి మరచిపోయి కామేశం. "నా నగరంలో దోపిడీ కథలో థీమ్ అదేనండీ. ఈ మధ్యనే వ్రాసాన్లెండి. కథకి మంచి పేరొస్తుంది." అని కామేశం చెప్పబోయేసరికి, "మీరింక రాసుకోండి పోయి, మీ కథకోపన్యాసం ప్రారంభిస్తే మరింకేం మాటాడనివ్వరు" అని భానుమతి అంది.

"నీకేం? నా కథల గురించి నేను చెప్పుకోకూడదా? అసలు నువ్వు భార్యవయి నాలో టాలెంటుని పూర్తిగా ఖూనీ చేశావు. లేకపోతే ఆంధ్రప్రదేశం మరో గొప్ప రచయితని పొందగలిగి ఉండేది."

"పోన్లెండి. ఇప్పటికే మీలాటి వాళ్ళ భారాన్ని మొయ్యలేక నలిగిపోతోంది భూదేవి". భార్య అలా అనే సరికి సీరియస్‌గా ముఖం ముడుచుకున్నా ఆతరువాత సుందరమ్మ వాళ్ళిద్దర్లో దేన్నో వెతుకుతోంది. నిశ్శబ్దంగా ఉన్న అర్థ రాత్రిలో సంచీతో వెండినాణెల్ని గచ్చుపై వొంపుతున్నట్లు గలగలా నవ్వుతూ, చప్పట్లు కొట్టి "భలే..... భలే.... బావగార్నిప్పుడే ఫోటో తీస్తే అలక పాన్పు మీద కొత్తల్లునిలా కనిపిస్తారు" అనేసి "బావా! మీరు కథలు రాస్తారా" ప్రశ్నించింది వరలక్ష్మి.

"ఆఁ...... రాస్తారే తల్లీ" విసురుగా భానుమతి అంది. "ఏ పత్రికలో పడుతుంటాయండీ బావా?" 'వరలక్ష్మి' ఆ ప్రశ్నవెయ్యకుండా ఉంటే బాగుండే దనిపించింది కామేశానికి. ఆయన హస్యకథలు వ్రాయటం కాదు కాని జోకుల్తో తెగ చంపుతారనుకో, ఏ రచయితయినా కథ తిరిగొస్తె 'మొర్రో' మని గోల చేసేస్తాడు ఈయన మాత్రం గొప్ప 'స్పోర్టివ్'గా తీసుకుంటారు. కథలు తిరిగొచ్చిన్నాడు ఇలాగే గొప్పగా నవ్విస్తార్లే" అని అనేసరికి కామేశం అక్కణ్ణించి తప్పుకుని ఇంట్లోకెళ్ళిపోయాడు మంచం మీద బోర్లా పడుకుండిపోయాడు.

ఇంతలో పోస్ట్‌మాన్ ఓ కవరు విసిరి వెళ్లాడు.

కామేశానికి దుఃఖ వచ్చేస్తోంది.

పత్రికల వాళ్ళమీద కోపం వచ్చేస్తోంది.

"ఈ పత్రికల వాళ్ళకసలు బుద్ధిలేదు. బుర్రనెంతగానో పాడుచేసుకొని, నానా కష్టాలూ పడి వ్రాస్తే కనీసపు 'సింపతీ' అయినా లేకుండా రిటన్ చేసేస్తారా? వీళ్ళనీ, వీళ్ళ పత్రికల్నీ బేస్

చేసి పారెయ్యాలి.

పోస్టుమాన్!

'దెయ్యంలాగ ముఖం వాడూనూ'

పోనీ పత్రికలవాళ్ళు వాళ్ళకి నచ్చలేదని రిటన్ జేస్తే చేసారు.

ఇంట్లో చుట్టాలూ పక్కలూ ఉన్నప్పుడు అందరిముందూ రిటన్ అయిన కథల్ని అలా విసిరివేయటమేమిటి ఆ పోస్టుమాన్!

సభ్యత ఉండక్కర్లా?

కవరు చూసుకున్నాడు మరోసారి. నిన్న సాయంకాలం ట్రయిన్‌లో వచ్చినట్లుంది ఆ ట్రయిన్ మొన్న రావాల్సిందిలాగుంది.

'రైల్వే వాళ్ళకంతకాన్న బుద్ధిలేదు. రావలసిన టైంలో ట్రయిన్సురావు

అందవలసిన కథలు సకాలంలో అందకపోతే రచయిత లెంత అవమాన పడిపోవాలి?

ఎంత బాధపడిపోతారని!

ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? రైల్వే వాళ్ళమీద ఎందుకు సరైన ఏక్షన్ తీసుకోదని?

ఛీ ఛీ వీటన్నిటి మీదా ఓ కథ వ్రాసి పడేస్తేకాని లాభం లేనట్లుంది కామేశంలో ఘర్షణ!

అతనికేదో ఆలోచన వచ్చింది.

లేచి తన పైల్సన్నీ తిరిగి చూసుకున్నాడు.

బల్లమీద మూటలు కట్టిన పదేళ్ళ నాటి పాతకథలు కొన్ని కనిపించలేదు. వెంటనే భానుమతి నడిగారు.

భానుమతి సమాధానం చెప్పింది.

"వైజయంతి మొన్న నెప్పడో కుంపటి ముట్టించటానికేవో కాగితాలు తీసింది. అదికాని తీసిందేమో!" అని.

'ఎంత రెక్లెస్ సమాధానం!'

కామేశం భార్యకి గట్టిగా డోసిచ్చాడు. భానుమతి కూడా ఊరుకోలేదు. సుందరమ్మకిదేం నచ్చక ఆ మార్నాడే మళ్ళీ 'అనకాపల్లి'లో చుట్టాలింటి కెళ్ళొస్తానని చెప్పి బయల్దేరింది వరలక్ష్మితో భానుమతి ఎంత వద్దన్నా వినక, రామారావూ బయల్దేరిపోయాడు

భానుమతి కన్నీళ్లు దించుకుంది.

కామేశానికీ కన్నీళ్ళొచ్చాయప్పుడు.

పోస్టుమాన్ ఇచ్చిన ఉత్తరం చించి చదివింది భానుమతి. ఆరుమాసాల క్రితం ఆమె పేరుతో ప్రచురింపబడిన కథకి పారితోషికం పంపమంటూ వ్రాసిన కామేశం ఉత్తరానికి జవాబది.

భానుమతి వెంటనే కాగితం తీసుకుని ఉత్తరం వ్రాసింది.

'జయభేరి' సంపాదకులకు.....

నమస్సులు.

నా ప్రచురణకు నోచుకోని కథకు పారితోషికం విషయమై మీరు వ్రాసిన ఉత్తరం అందింది. క్రొత్త రచయితలకి ప్రోత్సాహం మాత్రమే కలిగించగలమని, పారితోషకం యిచ్చుకోలేమని మీరు వ్రాశారు బాగానే వుంది.

కాని కథ నా పేరుతో పంపినా కథ వ్రాసింది మావారే. ఆయన కథా జీవితం పాతిక సంవత్సరాలు దాటిపోయింది? వారు రోజుకో కథ, వారానికో నవల వ్రాస్తునే వున్నాను. లిఖిత పత్రికల నుండి పెద్ద పత్రికల వరకూ ఆయన పేరు వినని వారుండరు. ఆయన కన్పించిన ప్రతి పత్రికకి కథలు పంపుతునే ఉంటారు.

మీ రాయనని పాత రచయిత కాదేమోనని అనుమానించే లాగయితే మా యింటి కొకసారి రండి. మా బీరువాలనిండా ఆయనకి తిరిగొచ్చిన కథల కట్టలెన్నున్నాయో మీకే తెలుస్తుంది.

అంతెందుకు?

అతనికి తిరిగొచ్చి కథల్ని క్వింటాల్సుగా అమ్మి నేనో పట్టుచీర కొనుక్కున్న సంగతి, మా మూడో పాపకి లోలక్కులు చేయించిన సంగతీ మీకేం తెల్సు?

మా పెద్దపాప ఆయన తిరిగొచ్చిన కథలతో కాగితపు బుట్టల్ని చేసి, స్థానికంగా లైన్సు క్లబ్బు వాళ్ళు పెట్టిన చేతిపనుల పోటీలో వెయ్యి నూటపదార్లు బహుమతి పొందిన సంగతి మీకు నమ్మకం లేకపోతే వాళ్ళకి లెటరు వ్రాసి కనుక్కోండి?

మరింకా ఆయన్ని మీరు కొత్త రచయితే

నంటారా? అందునుంచి-

మీరు పంపాల్సిన పారితోషకం వెంటనే జాప్యం లేకుండా పంపగలరని ఆశిస్తూ ముగిస్తున్నాను.

భవదీయ

-భానుమతి"

ఉత్తరం మడిచి కవర్లోపెట్టి పోస్టుడొక్కులో పడించేసి కామేశం రాగానే విషయాన్నంతా వివరించి చెప్పింది భానుమతి. ఆ రాత్రల్లా ఆలోచించినా కామేశానికి పాతికేళ్ళుగా చేస్తోన్న తన సాహిత్య వ్యాసంగం తనకేమీ తృప్తి నిచ్చినట్లు కనిపించక పోయేసరికి చాలా బాధపడిపోయాడు. ఆ రాత్రికి కూర్చుని ఓ కథ తీసి ఫెయిరెక్కించేసి 'రణభేరి' సచిత్ర వార పత్రికకి భార్య పేరనే పంపించేశాడు. నెలరోజుల్లో కథ సెలెక్టయినట్లు కార్డొచ్చి, మరో వారం రోజుల్లో మంచి బొమ్మతో అచ్చయింది. అప్పుడు కామేశం పొందిన ఆనందం మాటల్లో చెప్పడం కష్టం.

అమృతాన్ని త్రాగుతున్నట్లు, అప్సరసతో డాన్సు చేసినట్లు ఇంకా అనేక రకాలుగా అయిపోయాడు.

మరో వారం రోజుల్లో 'ఇది ఫలానా' పత్రికలో పడ్డ 'ఫలనా' కథకి మక్కికి మక్కిగా అని అనేమంది పాఠకులు ఉత్తరాలు వ్రాసినట్లు, తగిన సంజాయిషీని కోరుతూ సంపాదకుడు వ్రాసిన ఉత్తరం అందుకున్నాడు కామేశం.

కామేశానికి అప్పుడు పూర్తిగా కోపం వచ్చేసింది.

"గౌ॥ రణభేరి సంపాదకులకు.....

పాఠకులనుండి వచ్చిన ఉత్తరాలకి సంజాయిషీని కోరుతూ మీరు వ్రాసిన ఉత్తరం అందింది.

దానికి నా ఈ సమాధానాన్ని సహృదయంతో చిత్తగిస్తారు కదూ? పాఠకులారా? శాంతించండి!.... మీరు నా ఉత్తరాన్ని ఓపికతో చదవండి! నిజమే!

మీరు వ్రాసినట్లు ఈ కథ కాపీ కథే! కాదనను కాని ఏది కాపీకథో ఏది కాదో మీరు చెప్పగలరా? ఇప్పుడొస్తున్న ప్రతి 'తెలుగు' కథకి ఓ 'హిందీ' కథ మూలం. ప్రతి 'హిందీ' కథకి ఓ 'మళయాళీ' కథ మూలం. ప్రతి 'మళయాళీ' కథకి ఒక 'బెంగాలీ' కథమూలం. ప్రతి 'బెంగాలీ' కథకి మరో 'రష్యా' కథ ప్రతి 'రష్యా' కథకీ మరో 'చైనా' కథ. ప్రతి చైనా కథకి ......... ఇలా చెప్పాలంటే మూలం ఉంటూనే ఉంటుంది.

అలానే 'కథని పోలిన కథ లేదంటారా?

అంతమాత్రాన అదో పెద్ద దోషంగా భావించితే ఎలా? ఇంతకీ అసలు కథ!

ఈ కథ నేను కథలు వ్రాయటం ప్రారంభించిన కొత్తగా అంటే పంథొమ్మిది వందల నలభై యేడులో నాపేరుతోనే 'ధూపం' అనే ఆ పత్రికకే పంపించాను. పంపినట్టే మరిచిపోయాను. అరవై ఏడులో నాకథ ప్రచురణకు స్వీకరించినట్లు వచ్చిన కార్డు చూసాక నా ఫైలు తిరగేసుకున్నాను. ఆ కథ నేను పంపిందే! తరువాత చాలరోజులు చూసాను. ఉత్తరాలు కూడా వ్రాశాను వేగరం ప్రచురించవలసిందని!

అ దెప్పుడు ప్రచురింపబడిందో నా కసలు తెలియదు. ఒక సారియినా పారితోషికం పుచ్చుకోవాలని చూసి చూసి విసుగెత్తి నేనే ఆ కథని మా ఆవిడ పేరుతో మీ పత్రికకు పంపించాను. కథ అచ్చయింది నా పేరుతోనే క్రితం ఆ కథ ప్రచురణ భాగ్యానికి నోచుకున్నదని ఇప్పుడే తెల్సుకున్నాను.

నాకు చాలా ఆనందంగా ఉంది!

ప్రియమైన పాఠకులారా.......! శాంతించండి ఇది నిజం!

ఇప్పుడే నేనుమిమ్మల్ని అర్థిస్తున్నాను.

నా పేరును అచ్చులో చూసుకోవాలని ముప్పయ్యేళ్ళుగా నేను పడుతున్న బాధని మీ కెలా చెప్పను?

దయచేసి మీలో ఎవరి దగ్గర ఆ కాపీ ఉన్నా నాకు పంపుతారుకదూ? ముందు పంపిన వారికి పది రూపాయలు పారితోషికం అందచేయగలను!

ఎడిటరుగారూ.......! అందండీ కథ!

రచయిత కామేశం అని 'రణభేరి' పత్రికకి ఉత్తరం వ్రాసి పడేశాడు కామేశం.